www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 10 ఆగస్టు 2024

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

7,56,949 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ రాష్ట్రాల నుంచి గోదావరిలో కలుస్తున్న ఉప నదులు, కొండ వాగుల నీటితో గోదావరి నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరిగింది. భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గడంతో గోదావరిలో నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతూ వస్తుంది. శుక్రవారం నాటికి గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గడంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,56,949 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 31.500 మీటర్లు, స్పిల్ వే దిగువున 22.860 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.90 అడుగులకు చేరుకుంది.

వైసిపికి ఎదురుదెబ్బ..!

మాజీ మంత్రి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని రాజీనామా

ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు లేఖ

వైసిపి నాయకులు, కార్యకర్తల్లో షాక్

పదవులు అనుభవించి.. కష్టకాలంలో తప్పుకోవడంపై విమర్శలు

జనసేనలో చేరనున్నట్లు ప్రచారం ?

నాని బాటలో మరికొందరు నాయకులు రాజీనామా అంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగలింది. ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలూ కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని గట్టి షాక్ ఇచ్చారు. ఏలూరు జిల్లా అధ్యక్ష, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవులకు రాజీనామా చేస్తూ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోన్‌రెడ్డికి లేఖ రాయడం జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. 'వ్యక్తిగత కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని, ఏలూరు జిల్లా అధ్యక్ష నియోజకవర్గ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు.'. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాత్రం ఆయన లేఖలో పేర్కొనలేదు. రాజీనామా లేఖ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగడం తప్ప ఆయన నేరుగా ప్రకటించకపోవడంతో వాస్తవమా.. కాదా అన్న సందిగ్ధత అందరిలోనూ నెలకొంది. ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో నిర్ధారణ కోసం ఆ పార్టీ నాయకులు, ఆళ్లనాని అనుయాయులకు ఫోన్లు చేసి కనుక్కునేందుకు ప్రయత్నం చేశారు. వాస్తవమని తేలడంతో నాని హఠాత్తుగా రాజీనామా నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆళ్లనాని రాజీనామాపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచే కాకుండా జనాల నుంచి సైతం తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పదవులు అనుభవించి కష్టకాలంలో పార్టీని వీడుతారంటూ అంతటా చర్చ కొనసాగుతోంది. 2004, 2009లో కాంగ్రెస్‌లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందిన ఆళ్లనాని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత జరిగిన

పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి 2013లో వైసిపిలో చేరారు. 2014 ఎన్నికల్లో ఏలూరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షునిగా, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవులు నిర్వహించారు. 2017లో శాసన సభ్యుల కోటాలో వైసిపి ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. 2019 జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందారు. డిప్యూటీ సిఎం, ఆరోగ్యశాఖా మంత్రి పదవులు అనుభవించారు. జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాకు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గడిచిన ఎన్నికల వరకూ ఆళ్ల నాని జిల్లా అధ్యక్షునిగా, ఏలూరు ఎంఎల్‌ఎగా కొనసాగారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీచేసి భారీ ఓటమిని చవిచూశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. విశాఖలోనూ, బెంగుళూరులోనూ ఉంటున్నట్లు జోరుగా ప్రచారం సాగింది. ఏలూరు నియోజకవర్గంలో టిడిపి నాయకుల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైన సమయంలోనూ ఆయన వారికి అండగా నిలబడకుండా వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పదవులు అనుభవించి కష్టకాలంలో హ్యాండ్

వైసిపిలో పెద్దపెద్ద పదవులు అనుభవించిన ఆళ్ల నాని ఎన్నికల్లో పార్టీ ఓటమి చెంది కష్టకాలంలో ఉన్నప్పుడు రాజీనామా చేయడంపై ఆ పార్టీ నేతల్లో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్ ఎవరికీ ఇవ్వనంతగా నానికి అవకాశాలు ఇచ్చారని, ఆయన ఇలా చేయడం ఏంటన్న ప్రశ్న పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తోంది. నాని రాజీనామా చేసినట్లు తెలిసి ఆయనను నమ్ముకుని రాజకీయాలు చేసిన తమను నట్టేట ముంచేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క టిడిపి నాయకుల నుంచి తీవ్ర ప్రతిఘటన కొనసాగుతున్న తరుణంలో నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండకుండా రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయకపోవడంతో ఎన్నికల తరుణంలో మళ్లీ నాని వచ్చే అవకాశం ఉందన్న చర్చ సైతం నడుస్తోంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ ఆయన జిల్లాలో పెద్దగా ఉండలేదు. ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పుడు వచ్చి బెంగుళూరు వెళ్లిపోతున్నారని చర్చ సాగేది. అయినప్పటికీ జగన్ ఆయనకు పదవుల విషయంలో పెద్దపీఠ వేసిన పరిస్థితి కొనసాగింది. పార్టీకి సంబంధించిన జోనల్ పదవి వంటివి నానికి ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ సైతం మరోపక్క నడుస్తోంది.

నానిబాటలో మరికొందరు నాయకులు?

ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాలో మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలతోపాటు పెద్దనాయకులు ఎవరూ బయటకు రాని పరిస్థితి నెలకొంది. జిల్లాను వరదలు ముంచెత్తినా ప్రజల వద్దకుగానీ, రైతుల వద్దకుగానీ, వైసిపి నాయకులు ఒక్కరు కూడా వెళ్లలేదు. రైతుల కష్టాలపై ఒక్క ప్రకటన కూడా విడుదల చేయలేదు. నాని బాటలోనే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మరికొందరు నాయకులు వైసిపి రాజీనామా చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. నాని బాటలో మరికొంతమంది నాయకులు రాజీనామా చేస్తే వైసిపికి మరింత పెద్దదెబ్బ తగిలే పరిస్థితి ఏర్పడనుంది. పార్టీ అగ్రనాయకత్వం ఏవిధమైన చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

జనసేనలోకి ఆళ్ల నాని?

వైసిపికి రాజీనామా చేసిన ఆళ్ల నాని జనసేనలో చేరనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఏలూరు నియోజకవర్గంలో జనసేనకు మంచి పట్టు ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో ఆయన జనసేనలో చేరి రాజకీయాల్లో కొనసాగుతారన్న చర్చ సాగుతోంది. నాని స్వభావం రీత్యా వేరే పార్టీలోకి వెళ్లే అవకాశం లేదని, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయలేదు కాబట్టి ఎన్నికల సమయంలో మళ్లీ వచ్చే అవకాశం ఉందని మరో చర్చ నడుస్తోంది.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

విద్యతోనే గిరిజనులకు ఉజ్వల భవిష్యత్తు

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్య ద్వారానే గిరిజనుల భవిష్యత్తు మారుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మండలంలోని కోట రామచంద్రాపురంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ వైటిసి సెంటర్లో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ గిరిజన మహిళలతో ఉత్సాహంగా ధింసా నృత్యంలో పాల్గొన్నారు. గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన ధింసా, కొమ్ము నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్య అభివృద్ధికి పునాది అని తెలిపారు. తాను ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చానని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఉన్నత విద్యే లక్ష్యంగా చేసుకుని ఐఎఎస్ సాధించానని తెలిపారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్క తల్లిదండ్రులూ తమ పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లల ఉన్నత విద్యలో ఏదైనా ఆటంకం గానీ, సమస్య గానీ కలిగితే వెంటనే తనను సంప్రదించాలన్నారు. గిరిజనుల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతిస్తామన్నారు. సమస్యలు తెలియజేసేందుకు వ్యయప్రయాసలకోర్చి ఏలూరు వరకూ రానవసరం లేదని, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా మీ ప్రాంతంలోనే ప్రతి నెలా 1వ తేదీన ఒక గిరిజన మండలంలో ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనుల భూ సమస్యలు, రైతులు, వివిధ సమస్యల తెలుసుకునేందుకు వివిధ శాఖల అధికారులందరూ మీ వద్దకు వస్తారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

గిరిజనులతో కలిసి ధింసా నృత్యం చేస్తున్న కలెక్టర్, జెసి

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ రానున్న రెండు సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాలను కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి చేస్తానన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టిస్తానన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. గిరిజనులు కల్లాకపటం తెలియని, కల్మషం లేనివారన్నారు. తాను పాడేరులో పిఒగా పనిచేసినప్పుడు తనను వారు ఎంతగానో అభిమానించేవారన్నారు. అనంతరం చిర్రి బాలరాజు జిల్లా కలెక్టర్‌ను సత్కరించారు. అలాగే గిరిజన మండలాల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు స్టాల్స్‌ఏర్పాటు చేశాయి. వీటిలో ఐసిడిఎస్ వారు ఏర్పాటుచేసిన పౌష్టికాహారం స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ జి.శ్రీను కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, డిపిఒ తూతిక శ్రీనివాసు విశ్వనాథ్, గిరిజన సంక్షేమం డిడి నాయుడు, ఆదివాసీ జెఎసి అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలి

రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశ సంపదను కొల్లగొడుతున్న, వ్యవసాయ రంగాన్ని కబలిస్తున్న కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టాలని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు విజయ విహార్ సెంటర్లోని రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద శుక్రవారం రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె.భాషా, ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి (అన్నే భవనం) కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి (స్ఫూర్తి భవనం) డేగా ప్రభాకర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు గడసాల రాంబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య తదితరులు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలు అనుసరిస్తూ వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, అటవీ సంపదను, ప్రకృతి వనరులను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రైతాంగ, కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ కంపెనీల పన్ను రాయితీ ఇవ్వడమే కాకుండా గడిచిన పది సంవత్సరాల కాలంలో 16 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ల రుణాలు మాఫీ చేశారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న అన్నదాతలకు మాత్రం పైసా రుణమాఫీ చేయలేదన్నారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులకు విత్తన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ నిధులు కోత పెట్టడం, జాబ్ కార్డులు తగ్గించడం గ్రామీణ పేదల ఉపాధి దెబ్బతీయడమేనని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ఆర్.లక్ష్మణరావు, మన్నవ కృష్ణచైతన్య, పి.కిషోర్, కూచిపూడి నాగేశ్వరరావు, ఎ.అప్పలరాజు, కడుపు కన్నయ్య, కె.కృష్ణమాచార్యులు, సిహెచ్ గిరి, సిహెచ్ కుమార్ పాల్గొన్నారు.

విజయ విహార్ సెంటర్లో నిరసన తెలుపుతున్న నేతలు

తమ్మిలేరు వద్ద తగ్గిన వరద

తమ్మిలేరుకు తగ్గిన వరద

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో తమ్మిలేరు వరద ఉధృతి తగ్గింది. దీంతో ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజాము నుండి మున్సిపల్ అధికారులు, ఎంహెచ్‌ఒ డాక్టర్ మాలతి ఆధ్వర్యాన తంగళ్లమూడి ప్రాంతంలోని ఆరు డివిజన్ల పరిధిలో శానిటేషన్ పనులు ప్రారంభమయ్యాయి. వరద ఉధృతి తగ్గడంతో తంగెళ్లమూడి వంతెన సమీపంలోని అన్నా క్యాంటీన్ పక్కన ఏటుగట్టున నివాసం ఉంటున్న 13 కుటుంబాల వారు వారి ఇళ్లకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో బ్లీచింగ్, ఫాగింగ్ చేశారు. అదేవిధంగా టైటాస్ నగర్, రాణి నగర్, కుమ్మరరేవు, తాపీ మేస్త్రి కాలనీ, మొదలగు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు.

రైతాంగ, ఆదివాసీ వ్యతిరేక విధానాలపై పోరాడాలి

రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, ఆదివాసీ వ్యతిరేక విధానాలపై పోరాడాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరులోని వసంత మహల్ నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా పాత బస్టాండు వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో షేక్‌బాషా మాట్లాడుతూ అడవులను, కొండలను సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పర్యావరణాన్ని కేంద్ర రాష్ట్ర పాలకులు విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నదాని ఫలితమే కేరళలోని వయనాడ్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి వైపరీత్యాలకు ప్రధాన కారణమన్నారు. స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్ల కాలంలో ఆదివాసీల జీవితాల్లో అభివృద్ధి రాలేదన్నారు. గిరిజనులు పోరాడి సాధించుకున్న 1/70, పీసా, 2006 అటవీ హక్కుల చట్టం వంటి గిరిజన సంక్షేమ చట్టాలన్నింటినీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూరితంగా అమలు చేయడం లేదన్నారు. దీనివల్ల ఆదివాసీ ప్రజానీకం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవులను, పర్యావరణాన్ని, ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులను భారతదేశం నుంచి తరిమికొట్టాలన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి, ఉపాధి హామీ పథకానికి కోతలు విధించిందని, అత్యధిక శాతం కార్పొరేట్లకు దక్కేవిధంగా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, వి.గౌరి, కె.రామారావు, మడి గిరి నాయకత్వం వహించారు.

ప్రదర్శన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఆహార విషయంలో రాజీ పడొద్దు

ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రభుత్వ బాలల సదనం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ శుక్రవారం దెందులూరులోని ప్రభుత్వ బాల సదనంను సందర్శించారు. బాలలకు అందిస్తున్న సౌకర్యాల పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహారం, పరిశుభ్రత, వసతి, రక్షణ, వైద్యం మొదలైన వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలతో ముచ్చటిస్తూ వారి వివరాలు, తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందించే ఆహార విషయాల్లో రాజీ పడొద్దని, సంస్థకు, పిల్లల తల్లిదండ్రులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలసదనం ఉద్యోగులు దుర్గా మల్లేశ్వరి, చంద్రిక పాల్గొన్నారు.

బాలలతో మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్

వినాశకర వ్యవసాయ బిల్లులు ఉపసంహరించుకోవాలి

అఖిలపక్ష రైతు సంఘాల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై వినాశకర వ్యవసాయ బిల్లులు ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో రైతులు శుక్రవారం నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. అవి కార్పొరేట్లకు ఉపయోగపరంగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల కోసమే పని చేస్తుందని, సామాన్య రైతు కోసం ఏ ఆలోచన లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు డి.రంగనాథ్, సిపిఎం నాయకులు ఎస్.సూర్యకుమార్, సిపిఐ నాయకులు కె.గురవయ్య, ఎపి రైతు సంఘం మండలాధ్యక్షులు ఎస్‌కె.కాలేషా, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అఖిలపక్ష రైతు సంఘాలు

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

జిల్లా ఆరోగ్య పర్యవేక్షణాధికారి కె.నరేంద్ర కృష్ణ

ప్రజాశక్తి నూజివీడు టౌన్

వర్షాకాలంలో సీజనల్ జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన పోస్టర్‌ను నూజివీడు పట్టణంలోని కోనేరుపేటలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నరేంద్రకృష్ణ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లోని మురుగు కాలువలు, కొబ్బరి చిప్పలు, పగల కొట్టిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు, వినియోగంలో లేని కూలర్లు, ఇతర వ్యర్థపదార్థాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం ఎంతో ముఖ్యమన్నారు. వర్షపు నీరు ప్రవహించేలా చూడాలన్నారు. నీరు నిల్వ ఉంటే ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసి బ్లీచింగ్ చల్లడం ద్వారా, ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల నివారణ జరుగుతుందన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. సీజనల్‌గా పెరిగే దోమల వల్ల విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులను సంప్రదిం చాలన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారని, అన్ని రకాల మందులు లభిస్తున్నాయని చెప్పారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే పెను ప్రమాదం సంభవించవచ్చని హెచ్చరించారు. ఇలాంటి విషయాలను ఇంటింటికీ ప్రచారం చేసి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. యుపిహెచ్‌సి వైద్యులు కొలుసు సౌమ్య, వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.నరేంద్రకృష్ణ

63 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు, జూనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి అవకాశం కల్పించింది. దానిలో భాగంగా డైరెక్టర్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లాలో 80 మంది గ్రేడ్-2 జూనియర్ సహాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి అర్హత సాధించారు. అయితే వీరిలో 17 మంది వ్యక్తిగత కారణాల వలన ఉద్యోగోన్నతి వదులుకోగా 63 మందికి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి పొందిన సిబ్బంది జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్తర్వులు కాపీ తీసుకు న్నారు. ఉద్యోగోన్నతి కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ చేశా మని, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగిందని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షులు కారం నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు రావాల్సిన వేతనాలను ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. పొట్ట కూటి కోసం పనులకే ఉపాధి పనికి వెళ్తున్నవారికి సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతన బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సిపిఐ ఏలూరు జిల్లా కౌన్సిల్ సభ్యులు టివిఎస్.రాజు శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా సంతాపం తెలిపారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయన మృతికి సిపిఐ మండల నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, ఎఐటియుసి ఏరియా ఉపాధ్యక్షులు కొండమ్మ శ్రీనివాసరావు, మక్కినవారిగూడెం హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లుల సత్యనారాయణ, సతీష్, సుబ్బారావు సంతాపం తెలిపారు.

సొసైటీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోండి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని నూజివీడు పట్టణం 11 గ్రామాల్లో ఉన్న సభ్యులందరూ కెవైసి వివరాలను తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేయించుకోవాలని సంఘం సిఇఒ నీలం నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం సహకార సంఘాల అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల కెవైసి వివరాలను ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ జరుగుతుందని, వెంటనే నమోదు చేయించుకోవాలని చెప్పారు.

ఎస్‌ఐ కుటుంబరావుకు సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉద్యోగ, క్రీడా రంగాల్లో రాణించాలని ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, జిల్లా సాధికారిత అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు అన్నారు. చింతలపూడి ఎస్ఐ ఎం.కుటుంబరావును శుక్రవారం ఎస్‌సి ఎస్‌టి, బిసి, మైనారిటీ నాయకులు సన్మానించారు.

ఇ-పంట నమోదు చేయించుకోండి

ప్రజాశక్తి - చింతలపూడి

ఖరీఫ్ 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఉద్యాన, వ్యవసాయ శాఖల ద్వారా ఇ-పంట నమోదు ప్రారంభించిందని, ఉద్యాన అధికారి ఎమ్‌డి.షాఫియా తెలిపారు. ప్రతిఒక్కరూ ఇ-పంట నమోదు చేసుకోవాలని చెప్పారు.

ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత అని, చెట్లను నరికి అడవులను నాశనం చేయడం వల్ల ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు భారీ వర్షాలకు ఊర్లు కొట్టుకుపోకుండా చెట్టు మనల్ని కాపాడతాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు చెప్పారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు అఖిల భారత యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బివి.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి కృష్ణ అల్లావారు ఆదేశాల మేరకు భారత యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జాతీయ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అనంతరం నూజివీడు, ఉంగుటూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం బందాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటేశ్వరరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సిపిఐ నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ నాయకులు శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జమ్మి శ్రీనివాసరవావు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు పేద ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి నూజివీడు ప్రాంతంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పార్టీ ఉద్యమాల్లో జైలు జీవితం కూడా గడిపారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మేడిశెట్టివారిగూడెంలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని మేడిశెట్టివారిగూడెంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.మాధవి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలన్నారు. బాల్య వివాహాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

బాలికలతో ఎవరైనా అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.ధనలక్ష్మి, ఆర్.రాజ్యలక్ష్మి అన్నారు. ముసునూరు, వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతి విద్యార్థులకు పలు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు, వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్ని రాంబాబుకు పితృవియోగం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రామారావు (ఫైల్)

మండల పరిధిలోని పిన్నమరెడ్డిపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యులు, దళిత నాయకులు, టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా నాయకులు జన్ని రాంబాబు తండ్రి జన్ని రామారావు(70) గురువారం రాత్రి ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన నాలుగు పర్యాయాలు పిన్నమరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులుగా గెలుపొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పలు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు

ఆర్‌జియుకెటిలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో జనరల్ కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు కలిపి 238 మందిని పిలువగా 134 మంది ప్రవేశాలు పొందారు. ఆర్‌కె వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు కలిపి 518 మందిని పిలువగా 310 మంది ప్రవేశాలు పొందారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్ ప్రారంభిస్తామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలిపారు.

కూరగాయలు వితరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితిలో ఏ ఆధారం లేని వయోవృద్ధులైన పెద్దలకు నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి యువ న్యాయవాది, తిరివీధి లక్ష్మీరామారావు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి కృష్ణ కూరగాయలను శుక్రవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు పంద్రంగి సత్యనారాయణమూర్తి, బ్రహ్మచారి భాస్కరన్ స్వామీజీ మాట్లాడుతూ ప్రతి నెలా కనీసం నాలుగు పర్యాయాలు కూరగాయలు, పౌష్టికాహారం వితరణగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఇఒ భాస్కరకుమార్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఎంఇఒ-2 ఎం.భాస్కరకుమార్ శుక్రవారం ఉంగుటూరు మండల విద్యాధికారి-2గా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఉంగుటూరు ఎంఇఒ-2 ఉద్యోగ విరమణ చేసిన కారణంగా ఏర్పడిన ఖాళీలో భీమడోలు ఎంఇఒ-2కు విద్యాశాఖ ఆర్‌జెడి అదనపు బాధ్యతలను కేటాయించారు.

ఆ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేదు..!

ప్రభుత్వ పౌష్టికాహారానికి దూరంగా చిన్నారులు
కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆ గ్రామానికి ఇప్పటివరకూ అంగన్వాడీ కేంద్రం లేదు. రోడ్లు, సరైన శానిటేషన్, వసతులు లేక అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. సుమారుగా 20 మంది విద్యార్థులు ఉన్న ఆ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం లేదు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పించి పాఠశాలకు అలవాటు చేస్తారు. కాని ఆ గ్రామంలో ఆ పరిస్థితి లేదు. ఇదీ మండలంలోని మెతుకుమెల్లివారిగూడెంలో దుస్థితి. ఆ గ్రామంలో అంగన్వాడీ సెంటర్ ఎందుకు లేదో, కేటాయించలేదో తెలియని పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సిన చిన్నారులు రోడ్ల వెంబడి తిరుగుతున్నారు. ఊట సముద్రం అంగన్వాడీ సెంటర్‌కి వెళ్దామనుకున్నా సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉండడంతో అది జరగని పరిస్థితి. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం కూడా చిన్నారులకు అందడంలేదు. ఈ విషయంపై గతంలో అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పతంగులగూడేనికి చెందిన అంగన్వాడీ టీచర్ మెతుకుమిల్లివారిగూడెం వెళ్లి అక్కడ కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడీ స్కూలు నిర్వహించారు. కాని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగన్వాడీ సెంటర్ పాఠశాల నడపడం కుదరదని చెప్పడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

ఐసిడిసి పీడీ పి.మాధవి, చింతలపూడి

గతంలో మెతుకుమిల్లి వారిగూడెంలో అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. చిన్నారులు ఉన్నారని, కేంద్రం అవసరమని వివరించాం. ఈ విషయాన్ని మళ్లీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయరూ..!

ఉప్పలపాడు వాసుల వేడుకోలు

శిథిలావస్థకు చేరి లీకవుతున్న వర్షపు నీరు

కామవరపుకోట : చిన్న పిల్లల్లో ఆకలి, పోషకాహార లోపాన్ని ఎదుర్కొవడానికి ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామస్థాయిలో అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఈ పథకం ప్రారంభించి సుమారు 49 సవంత్సరాలు అవుతున్నా నేటికీ పలు సమస్యలు ఈ కేంద్రాలను పట్టి పీడిస్తున్నాయి. మండలంలోని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ గోపాల్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం 151 అధ్వాన స్థితిలో ఉంది. పాత స్కూల్ భవనంలో ఈ కేంద్రాన్ని సుమారు ఎనిమిదేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో సుమారు పది మంది వరకు పిల్లలు ఉన్నారు. ప్రీ-స్కూల్ కార్యకలాపాలు ఉన్నాయి. బిల్డింగ్ స్లాబ్ అంత పగిలిపోవడం వల్ల కొద్దిపాటి వర్షం పడినా వర్షపు నీరు అంత లీకు అవుతుంది. దీంతో బిల్డింగ్ అంతా తడిచిపోతుంది. గది అంతా తేమగా మారడం వల్ల చిన్నారులు కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ కేంద్రం ముందు నీరు నిలిచిపోయి ఉండటంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా కేంద్రంలో ఉన్న ఎలక్ట్రికల్ స్విచ్‌లు, లైట్లు సరిగా పని చేయడం లేదు. బిల్డింగ్ అంతా పగిలిపోయి నీరు లీకు అవ్వడంతో పిల్లలను ఈ కేంద్రానికి పంపించడానికి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్లాబ్ పగుళ్లు వచ్చి ప్రమాదకరంగా ఉన్న ఈ బిల్డింగ్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పారిశుధ్య మెరుగుదలకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని మెతుకుమెల్లివారిగూడెంలో వాటర్ ట్యాంకును అధికారులు శుభ్రం చేయించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల వద్ద పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకున్నారు. ఈ సమస్యలపై వర్షామొస్తే ఆ గ్రామానికి కష్టాలే..! శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు జిల్లా, మండల అధికారులు స్పందించారు. ఆ మేరకు వాటర్ ట్యాంకును శుభ్రం చేయించడంతో పాటు పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకున్నారు. మండల అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వడాలి పంచాయతీ కార్యదర్శిగా సంగమయ్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె.సంగమయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామపంచాయతీ గ్రేడ్ -3 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సంగమయ్య ఉద్యోగోన్నతిపై గ్రేడ్ -2 పంచాయతీ కార్యదర్శిగా వడాలి గ్రామపంచాయతీలో బాధ్యతలు చేపట్టారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని డిఎస్‌పి రవిచంద్ర చెప్పారు. జంగారెడ్డిగూడెంలో-బుట్టాయగూడెం రోడ్డులో లైసెన్స్ లేని వాహనదారులకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు పట్టణ సిఐ మూర్తి, ఎస్ఐ దావులూరి రామకృష్ణ చలానాలు విధించారు. హెల్మెట్ ధరించే వాహనదారులను ఆపి వారిని అభినందిస్తూ వారికి గులాబీలు అందించారు.

విఆర్‌ఎల సంఘం హర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ సచివాలయలలో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రధాన ఆచార్యులు బి.రవికుమార్, వంగా నాగేశ్వరరావు కోరారు. కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ అధికారులు జి.నాగరాజు, బి.శశికాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన అధికారులు, సిబ్బంది నాగదుర్గ, మురళీ, చంద్రకళ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కళాశాలల ప్రధాన ఆచార్యులు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా డెంగీ ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీని ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై ఎక్కువగా పడే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు దోమలను అరికట్టాలన్నారు. దీనికోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డిఎంబిబి సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో భూదేవిపేట నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు అధ్యక్షతన సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో ఎటిఎ డివిజన్ అధ్యక్షులు ఇర్పా సూర్యచంద్రం, ఎపిజిఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, ఎపి ఎజిఎస్ జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్, ఎఎస్‌పి మండల కార్యదర్శి ఊకె ముత్యాలరావు, ఎఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎం.రాంబాబు, తాట్కూరు గొమ్ము సర్పంచి కట్టి ఉదయ్, ఎటిఎ నాయకులు పాయం రమేష్, వీరబాబు, ఎఎస్‌పి నాయకులు సోడే సీతారామయ్య మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారటం ప్రకాష్, పిట్ట వీరయ్య, సోడే రమేష్, గాలి బాలు, పొట్ల మోహన్, కారం వెంకటరమణ, మడకం సునీత, రజిని, శివకుమారి, అంజలి పాల్గొన్నారు.

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - దెందులూరు

వికలాంగ హక్కుల జాతీయ వేదిక దెందులూరు రూరల్ మండల శాఖ సమావేశం జిల్లా కన్వీనర్ కుందేటి జయరాజు అధ్యక్షతన దెందులూరులోని రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రంగమ్మ, ఎన్‌టిఆర్ దెందులూరు మండలాధ్యక్షులు అశోక్, ఎన్‌పిఆర్‌డి వికలాంగ హక్కుల జాతీయ వేదిక నాయకులు భూషణం, ప్రధాన కార్యదర్శి రంగయ్య, గౌరవ అధ్యక్షులు రంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు చేశారు. 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని, వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో అన్ని బస్సుల్లోనూ వికలాంగులు ఉచిత బస్ ప్రయాణాన్ని కల్పించాలని కోరారు. 15 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా రంగయ్య, ట్రెజరర్‌గా భూషణం శ్రీనివాస్ ఎంపికయ్యారు.

ఉద్యోగావకాశాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ కళాశాలలో కష్టపడి చదివే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ముందుకు వెళ్తున్నామని సర్ సిఆర్.రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబివిఎస్.ప్రసాద్ తెలిపారు. ఏలూరులోని సర్ సిఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌లో జీప్యాట్, నైపర్‌తో పాటుగా ఎపి పీజీ సెట్, తెలంగాణ పీజీ సెట్, క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను శుక్రవారం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సన్మానించింది. జీప్యాట్, నైపర్‌లలో అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.రెండు వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్ అందించారు. ఎపి పీజీ సెట్, తెలంగాణ పీజీ సెట్‌లలో అర్హత పొందిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు బహుమతి, సర్టిఫికెట్ అందించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో అర్హత పొందిన 43 మందికి మెరిట్ సర్టిఫికెట్లు అందించారు.

అసంఘటిత రంగ కార్మిక చట్టాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అసంఘటిత రంగ కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇందుకోసం అందరూ సంఘటితంగా పోరాడితేనే ప్రయోజనం చేకూరుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. అకారణంగా విధుల నుంచి తొలగించిన డిసిసిబి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఏలూరులోని డిసిసిబి బ్యాంకు వద్ద త్వరలో ఆందోళన చేపట్టేందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలగించబడిన డిసిసిబి ఉద్యోగులతో స్ఫూర్తి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డేగా ప్రభాకర్ మాట్లాడారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకొని పక్షంలో 54 మంది ఉద్యోగుల కుటుంబాలతో సహా ఆందోళనకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

రసాయన అవశేషాల ప్రభావంలేని నాణ్యమైన వ్యవసాయ దిగుబడులను సాధించేందుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి కోరారు. మండలంలోని దుద్దేపూడి గ్రామంలో మేలైన యాజమాన్య పద్ధతుల పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాల వద్ద వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది రైతులను కలిశారు. వారి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు పురుగు మందుల వాడకాన్ని వ్యవసాయ అధికారులు సలహాలు సిఫార్సు మేరకు తగు మోతాదుల్లో మాత్రమే వాడాలని కోరారు.

చాట్రాయి : మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో వ్యవసాయాధికారి బి.శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవాం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, సేంద్రీయ ఎరువులు వాడి నాణ్యమైన పంటను పండించాలని చెప్పారు. వరిలో మిత్ర పురుగులను, శత్రుపరుగులను గుర్తించి నివారణ చేయాలన్నారు.

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

విజయవాడలో అంబేద్కర్ శిలాఫలాకాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం దారుణమని వైసిపి నాయకులు అన్నారు. శిలాఫలకం ధ్వంసంపై వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన బస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, మండలాధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, బత్తిని చిన్న, అలుగు ఆనందశేఖర్ పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగ్‌లో ఉన్న బోనస్ ఇవ్వాలని కోరుతూ వంగూరులోని గౌతమి అగ్రో ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ 2024 మార్చిలో కార్మికులకు ఇవ్వాల్సిన బోనస్ ఇప్పటివరకు యాజమాన్యం చెల్లించలేదన్నారు. బోనస్ ఇచ్చే విషయంలో యాజమాన్యం తాత్సార్యం చేస్తుందన్నారు. తప్పని పరిస్థితుల్లో మహిళా కార్మికులు ఎక్కువమంది ఉన్న ఈ ఫ్యాక్టరీలో ధర్నా చేపట్టినట్లు చెప్పారు. జీతభత్యాలు కూడా పెంచాల్సిన సమయం దగ్గరకు వచ్చిందని, ఈ రెండు సమస్యలపై యజమాన్యం ముందుకొచ్చి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో యాజమాన్యం ఈ సమస్య పరిష్కారానికి ముందుకు రాకపోతే త్వరలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏలూరు వారి వద్దకు వెళ్తామని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రావాల్సిన బోనస్‌ను తక్షణం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి యూనియన్ ప్రెసిడెంట్ జానంపేట పద్మ, అలీసమ్మ, చిన్న రాణి, అనసూయమ్మ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తాటిపర్తి రామ్ బాబు తండ్రి : చిన్న రంగయ్య అను నేను పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది మల్లిపూడి నుండి పెనుమంట్ర జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది పాస్‌పోర్టు నెంబర్ : V4399229 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

అడ్రస్ : తాటిపర్తి రామ్ బాబు
తండ్రి : చిన్న రంగయ్య, డోర్ నెంబర్ : 4 - 31
పెనుమంట్ర మండలం, మల్లిపూడి
సెల్ : 8790728395

ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు గ్రామ కాపురస్తులు, పాలకొల్లు పల్లపువీధిలో డో.నెం. 17-2-15లో నివసిస్తున్న **వింజుమూరి రామకృష్ణ, S/o. late వెంకటరత్నం** అను నేను ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది.

యీ దిగువ షెడ్యూలు దాఖలా **డాక్యుమెంటు నెం. 4355/2000** రుగా రిజిష్టరు గాబడి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన ఉల్లంపర్రు గ్రామపంచాయతీ ఏరియాలోని ఉల్లంపర్రు గ్రామం పార్వతి నగర్ తాలూక జిరాయితీ పల్లం ఆర్.ఎస్. నెం. 235/3, 236 దాఖలా 4.50 భూమిని ఉల్లంపర్రు పంచాయతి వారిచే 10-3-1983 తేదీన పి.ఆర్. నెం. 64/83 రుగా అప్రూవల్ కాబడిన లేఅవుట్ ప్లాను దాఖలా ప్లాటు నెం. 28లో 331-5లో పాత డో.నెం. 4-70/1, కొత్త డో.నెం. 4-121 ను దాఖలా ఆర్.సి.సి. డాబా యిల్లు రెల్లి గాడి యింటి హద్దులు.

తూర్పు: లేఅవుట్ రోడ్ - 44.0 Sft. **దక్షిణం:** ప్లాటు నెం. 29/బి చెరుకూరి వెంకటేశ్వరరావు గారి సత్రం - 62.05 Sft. **పడమర:** రోడ్డు - 40.45 Sft. **ఉత్తరం:** ప్లాటు నెం. 27 దాఖలా మాధవరావు స్థలం - 82.65 Sft.

ఈ హద్దుల మధ్య *330 చ॥మీ॥ 277.16* స్థలం, యిందలి ఆర్.సి.సి. డాబా ఇల్లు నాకు మాత్రమే దాఖలు పడి ఉన్నది. దీనిపై ఎవరు ఎటువంటి హక్కుదారులు అని గాని, వారసులు అని గాని, అమ్మకాలు, కొనుగోలు జరిగిన ఎడల అవి చెల్లనేరవు. అవి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొందును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వింజుమూరి రామకృష్ణ
ప॥గో॥జిల్లా

IN THE HON'BLE COURT OF JUNIOR CIVIL JUDGE AT TEKKALI
OS. No. 19/2023

Between:- Sri. Krishna Kamakshi Pharmacy ...Petitioner
And:- Bhagya Lakshmi Medical Agencies, Respresented by its proprietors ...Respondents

GENERAL NOTICE

To;
1. Sri. Maddula Naga Venkata Ramesh, Proprietor: Bhagya Lakshmi Medical Agencies,Resident of D.No. 6-4-1/1, Kotipallivari street, Revenue ward No. 5, Narasapur, West Godavari District, A.P, PIN - 532275.
2. Sri. Balabhadra Santhosh, Proprietor: Bhagya Lakshmi Medical Agencies, Resident of D.No. 6-4-1/1, Kotipallivari street, Revenue ward No. 5, Narasapur, West Godavari District, A.P, PIN – 532275.

Please take the notice that the above matter is posted to dt: 30-08-2024 for your appearance and you are hereby directed to appear before the above Hon'ble Court on **Dt: 30-08-2024 at 10:30 A.M.**, either in person or through advocate without fail. Otherwise, the matter will be decided in your absence. Hence this notice.

//BY ORDER//

M.M. LAXMI, B. SRINIVAS RAO, P. MONICA,
ADVOCATE FOR THE PETITIONER, TEKKALI, CELL: 8074558590.

నోటీసు
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
FDIA.No.2/2022 in O.S.No.137/2014

Between:
శింగవరపు కుమారి ...Petitioner/Plaintiff
Vs
పోలిశెట్టి భాస్కరరావు ...Respondents/Defendant

To.
రెస్పాండెంట్/ప్రతివాది: పోలిశెట్టి భాస్కరరావు S/o.కృష్ణమూర్తి, కొప్పర్రు గ్రామము, నరసాపురం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో రెస్పాండెంటు హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను **ది.16-8-2024** తేదీకి వాయిదా వేసినారు. కాబట్టి రెస్పాండెంటు పై నెంబరు దావాలో **ది.16-8-2024వ తేదీన ఉ.10.30 లకు** స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ శ్రీకోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో రెస్పాండెంటును పరోక్షమందు పై నెంబరు దావా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని తెల్పడమైనది.

కోర్టు వారు ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకటరామారెడ్డి**
తేది.8-8-2024 అడ్వకేటు, పాలకొల్లు.

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.14/2022

Between :
చిలకలపూడి శ్రీను ...పిటీషనరు
Vs
1.బండి సత్యనారాయణ
2.కోట శేషుబాబు
3.The Official Receiver, West Godavari Dist., Eluru ...రెస్పాండెంట్లు

To.
1వ రెస్పాండెంట్ : బండి సత్యనారాయణ, తండ్రి సుబ్బారావు, డోర్‌నెం.2-117/2, స్కూల్ పెదమామిడిపల్లి గ్రామం, దిగమర్రు పోస్టు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు I.P లో పిటిషనరు, 1వ రెస్పాండెంట్ అయిన మిమ్ములను Insolvent గా Adjudge చేసి ది.26-07-2021 సం.తేదిన Under Document No.4380/2021 రున పాలకొల్లు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 2వ రెస్పాండెంట్ పేరున వ్రాసిన రిజిస్టర్ క్రియ దస్తావేజును రద్దు పర్చి పిటిషన్ 'B' షెడ్యూలు దాఖలా ఆస్తిని 3వ రెస్పాండెంట్ స్వాధీనం చేసుకొని ఆక్షన్ వేయించి సదరు ఆక్షన్ వేయ్యగా వచ్చిన సొమ్మును 'A' పిటిషన్ షెడ్యూలు దాఖలా ప్రామిసరీ నోట్ల బాకీలకు జమ చేయించుటకు గాను పిటిషనరు Insolvency Petition దాఖలు చెయ్యగా శ్రీకోర్టు వారు 1వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసులు పంపించమని ఉత్తర్వులు యిచ్చియున్నారు. శ్రీకోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం 1వ రెస్పాండెంట్ అయిన మీకు through కోర్టు మరియు రిజస్టర్ పోస్ట్ ద్వారా పలుమార్లు నోటీసులు పంపించినను తీసుకోకుండా Avoid చేయుచున్నందున శ్రీకోర్టు వారు Substituted Service అయిన Paper Publication ద్వారా తెలియపర్చమని ఉత్తర్వులు యిచ్చియున్నారు. సదరు 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా ఈ ప్రకటన చూసుకొని **ది.19-08-2024** సం. తేదీన ఉదయం గం.10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని తెలియచేసుకోవలెయును. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

Dr.**కొత్తపల్లి రమేష్** M.A.,B.Com.,LLB.,Ph.D.
అడ్వకేట్, నరసాపురం,
తేది.02-8-2024 సెల్: 9849021728

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో నరసాపురం, ప.గో.జిల్లా.
FDIA.No.1/2020 in O.S.156/2012

బిట్వీన్ :
1.శ్రీ గుబ్బల భవర దాస్ (Died)
2.శ్రీ గుబ్బల వెంకటేశ్వరరావు
3.శ్రీ గుబ్బల రామకృష్ణ ...పిటీషనర్లు
మరియు
1.గుబ్బల కబీర్ దాసు (Died)
2.శ్రీమతి గుబ్బల పెద్దంట్లు
3.గుబ్బల గణపతి
4.గుబ్బల సుందరరాజు
5.శ్రీమతి పితాని సత్యవతి
6.శ్రీమతి కుక్కల మంగ
7.శ్రీమతి పీతాని లక్ష్మి
8.శ్రీమతి పెచ్చెట్టి కుమారి ...రెస్పాండెంట్స్

నోటీసు

8వ రెస్పాండెంట్ :
శ్రీమతి పెచ్చెట్టి కుమారి, W/o.నాగేశ్వరరావు, డోర్‌నెం.1-33/2, శెట్టిబలిజపాలెం, చిన అయ్యప్పరోడ్డు, దొడ్డిపట్ల, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరగనందున ఈ ప్రకటన ద్వారా అమలు నిమిత్తం ది.**02.09.2024**వ తేదీన మీరు ఉదయం గం. 10.30 నిమిషములకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు ఫైనల్ డిక్రీ పిటిషన్ పై మీ పరోక్షమున తీర్మానించబడును. గాన తెలియజేయడమైనది.

జిల్లెళ్ళ సైమన్ విజయకుమార్, బూసి చిట్టిబాబు
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
స్థలం : నరసాపురం నరసాపురం.
తేది.09-08-2024 సెల్: 9290442260

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814